# ఆ ఉత్తరం

అనుభూతులు చాలా చిత్రంగా ఉంటాయి. ఎవరి అనుభూతి వాళ్ళదే. సామాన్యంగా రోజూచూసే దృశ్యాలే. ఎదురయ్యే అనుభవాలే, మనస్సునుబట్టి, వింత అనుభూతుల నివ్వవచ్చు. ఉదయ సంధ్యను, సాయం సంధ్యను రంగుల వాకిళ్ళన్నాడు కవి. ఎంత గొప్ప అనుభూతికావాలి ఆ మాట చెప్పటానికి, ఆ వర్ణచిత్రాన్ని ఊహించటానికి.

పోను పోను పోను. దక్షిణదేశపు చివరన రైలుప్రయాణం చేస్తూ ఉంటే. మనకు రెండుపక్కలా సముద్రాలు కనపడతాయి ఆ వేపూ యీ వేపూ, తూర్పూ. పడమరా। నేల కొసకంటా పోయేసరికి మూడు సముద్రాలు కనపడతాయి. మన భాష తెలీని మనుష్యులమధ్య కలగాపులగపు మనుషులు రకరకాలభాషలు మాట్లాడుకొంటూ రైలు ప్రయాణంలో మనకు తటస్థపడుతూ, ఎప్పుడో, ఎక్కడో. మనపట్ల అపేక్ష వ్యక్తంచేసే

ఒక మాట, ఒక సైగ. ఆప్యాయతతో కూడిన చిరునవ్వు వ్యక్తంచేస్తే వొకరిమాట ఎలావున్నా, నాకు విచిత్రమైన అనుభూతులు కలుగుతాయి. రామేశ్వరం నుంచి తిరుగు ప్రయాణంలో రామనాథపురం దగ్గర రైలాగే సరికి విపరీతమైన ఆకలనిపించింది రామేశ్వరంలో మధ్యాహ్నం అన్నం తిన్నట్లులేదు వేసవికాలం. ఇసకలో, ఆప్రదేశం యీ ప్రదేశం తిరిగి. సాయంకాలం ఏ నాలుగింటికో రైలెక్కాను. సాయంకాలం ఏడు కావస్తున్నది. రైల్వేస్టేషన్ కాంటీన్‌లో వేడివేడి ఇడ్లీ తినటం, ఆ ఆకలి మీద గొప్ప అనుభూతి. రాత్రి ఎంత పొద్దుపోయిందో. కొడైకెనాల్ స్టేషన్‌లో అల్ బకరా పండ్లు తినటం, వింత అనుభవమే. ఆ తరవాత, కంపార్టుమెంటు కిటికీకి చేరగిలబడి, నిద్రపోతే, ఏ స్టేషనో, ఏమో, పేరూ ఊరూ తెలీదు. ఒంటిగంట దాటే వుండవచ్చు. విపరీతమైనదాహం. రైల్వే ప్లాటుఫారంమీద రైలాగగానే, ఎదురుగా కొళాయి కనిపించింది. కడుపు నిండా నీళ్ళు తాగితే ఏమానందం ఎంత తియ్యగా వున్నాయి నీళ్ళు! వినీలమైన ఆకాశంలో, నవరత్నాలు పొదిగినట్లూ, వజ్రాలూ- వైడూర్యాలు కలబోసి చల్లినట్టూ నక్షత్రాలు. మళ్లీ కంపార్టుమెంటులోకి ఎక్కబోతూ, నడుస్తూవుంటే. లేడీస్ కంపార్టుమెంటులోంచి, వసంతకాలపు ఉదయాన ఏటిఒడ్డున తోటలోంచి కోకిల కూసినట్లుగా ఒక అందమైన అమ్మాయి. అమ్మాళో, కుట్టో, గిరిజో. వాసంతో ఎవరో వో జంగమ హేమలత, మరచెంబు అందిచ్చి నీళ్ళు తెచ్చిపెట్టమనడమూ. ఆ భాష అర్థంకాదు నిదానించి చూసేందుకూ లేదు పరుగున మరచెంబు నింపి. మళ్ళీ ఇచ్చేప్పుడు, ఆకుందరదన చూపేకృతజ్ఞత, ఎంత విచిత్రమైన అనుభూతినిస్తుంది. మళ్లీ జీవితంలో కలుసుకోం! కలుసుకున్నా గుర్తించుకోలేము. అయినా ఆ క్షణాన, అర్ధరాత్రి, వో అందమైన అమ్మాయి (అమ్మో అమ్మమ్మో. ఎవరో ఏమిటో మనకేం తెలుసు. అమ్మాయేనని, ఇంకా పెళ్లికూడా అయి వుండకూడదనీ, మంచి నీళ్లు తాగినప్పుడల్లా—ఆ రాత్రే కాదు, ఆ తరవాత

కూడా మననే పాపం మననం చేసుకుంటూ వుంటుందనీ, అభాగ్యపు ఊహలకేం!) మనని పలకరించటం ఎంత చిత్రమైన అనుభూతో!

తలఎత్తి ఆకాశంవేపు చూస్తేకాని కనిపించని గోపుర శిఖరాలు, ఉలుకూ పలుకూలేని చైతన్యంతో కలకలలాడే రాతిబొమ్మలా, అవి శిల్పాలతో నిండిన ఆలయాలు, అరటి తోటలూ, సంగీతం, సముద్రపు వొడ్లు, తమలపాకులు, నదులు, దక్షిణదేశం అందంగా వుంటుంది. తామ్రపర్ణిలో నీళ్ళు లేవు. కావేరి చల్లగా వున్నది. ఇసకతీస్తేగాని వైగై కనపడలేదు. అయినా పంచకల్యాణి గుర్రంమీద ఊహలకు రెక్కలు తొడిగి, భూత భవిష్యద్వర్తమానాలలో ఊరేగినట్లు వుండదా, అక్కడ అడుగులు పడు తున్నప్పుడు.

సుప్రసిద్ధ వాగ్గేయకారుల సంగీత సాహిత్యాలమీద పరిశోధన చేయటానికి భారత ప్రభుత్వంవారి విద్యార్థి వేతనంతో, దక్షిణాదిన తిరిగి చూశాను. తిరువయ్యూరులో తమలపాకులు కర్పూరం వాసన వస్తాయి. తిరుచినాపల్లిలో కొండఅరటిపళ్ళు తేనెలాగా వుంటాయి. తంజావూరులో మంగళాంబికావిలాస్‌లో కాఫీ ఎంచక్కా వుంటుందో! కామాక్షి అమ్మన్ కోవిల పక్కనే శ్యామశాస్త్రిగారి ఇల్లు. శ్యామకృష్ణ సోదరి అని, శ్యామశాస్త్రి కీర్తనలన్నీ ఆతల్లికే వినిపించేవాడట. బంగారుగజ్జెలు గల్లుమంటూ, చిన్నచిన్న చిట్టిచిట్టి చిన్నారి అందాల పాపలాగా, ఆతల్లి వెళ్ళి శ్యామశాస్త్రితో కబుర్లాదేదిట. ఆ గుళ్ళూ, ఇళ్ళూ అవన్నీ ఫోటోలు తీసుకున్నాను. రెండు నెలలు దక్షిణ దేశంలో ఆవూరూ, ఈవూరూ తిరిగేసరికి, ఏమయ్యా కాఫీ వేడిగా ఇవ్వు, ఈ బండి ఏవేపు పోతుంది, పోయివస్తాను, ఆకూ, వక్కా, ఇవ్వు. టిక్కెట్టు ఖరీదెంత అని వాళ్ళతో వాళ్ళ భాషలోనే మాట్లాడటం నేర్చుకొన్నాను. కొంచెం కొంచెంగా అక్షరాలు కూడబలుక్కొని, కార్ల మీద అవి బయలుదేరే, చేరే ప్రదేశాలు చదవటం నేర్చుకొన్నాను.

ఎలాగూ సరస్వతీ మహల్ లైబ్రరీలో ఏ రెండు నెలల పనో పడు తుంది గదాఅని, దక్షిణ దేశమంతా మళ్ళీ చూసేందుకు ఛాన్సు చిక్కు తుందో చిక్కదో అని తిరిగిచూశాను. కుర్తాళం జలపాతంలో స్నానం చేసి శ్రీవిల్లిపుత్తూరు చేరగానే సాయంకాలమైంది. ఆ రాత్రికి మధుర చేరాలి. అక్కడ వో స్నేహితుడు కాచుకునివుంటాడు. శ్రీవిల్లిపుత్తూరులో బస్ దిగుతూనే వాకబుచేశాను మధుర వెళ్ళే బస్సు ఎప్పుడు చిక్కుతుందో? అప్పుడే పరిచయమైనాడు సౌందరరాజన్. కళ్ళనిండా తెలివి, ముఖంనిండా అమాయకత్వం. మాటలన్నీ ముద్దుల మూటలు. చాలా చురుకు. అడిగాను బస్ ఎప్పుడుంది? ఎగాదిగా చూశాడు. సార్ మీరు ఇక్కడ కోవిల చూడ టానికి వచ్చారా? అని అడిగాడు అర్థమైంది కాని అరవం మాట్లాడ లేను అని చెప్పాను సూటూబూటూ చూశాడు, నవ్వాడు. ఆకళ్ళు తళుక్కు మన్నాయి. సార్ నేను మీకు గైడ్‌గా వుంటాను నాకు తెలుగురాదు. కోవెలలోవాళ్ళకివచ్చు. నేను తీసుక పోతాను కోవెలకు. రాత్రి ఎనిమిది న్నరకు మధురకువెళ్ళే చివరిబస్సువున్నది ఇప్పుడేదో బస్సువున్నది. కాని ఆబస్ వెళ్ళిపోయింది. మా అమ్మని ఆ బస్‌లోనే ఎక్కించి తిరిగి ఇంటికి వెళుతున్నాను. కళ్ళలో నీళ్ళు తిరగబోయినయ్. చాలా విచారంగా చెప్పాడు.

'నా ఇంగ్లీషు తప్పుగా వుంటుంది. మీరు క్షమించాలిసార్' అన్నాడు. సైన్స్ చదువుతున్నాట్ట రాజన్.

నేనూ తప్పులు మాట్లాడతానులే ఫరవాలేదు అని నవ్వాను. బస్ స్టాండ్‌లోనే వో హోటల్‌లో కాఫీతాగాము. రకరకాల రంగు రంగుల పూలుగుచ్చి కదంబమాల అమ్ముతున్నారు. ఎక్కడ చూసినా కొబ్బరి కాయలూ, పూలూ, పళ్ళూ, పసుపు, కుంకుమల చిన్న చిన్న దుకాణాలు.

మీరు ఎంతదాకా చదువుకున్నారు సార్ అని అడిగాడు అమాయకపు కుర్రాడు. ఎమ్. ఏ. అని చెప్పగానే, గుండ్రంగా నోరుతెరిచి, అవ్వ అని ఆనందపడిపోయి, నా కాళ్లు రెండూ కరుచుకునేంత హంగామా చేశాడు.

"ఏం లాభం సార్, నేనూ ఎమ్. ఏ. చదువుతాను కాని మానాన్న చదవనియ్యడు" ఆ కళ్ళు బాధతో చిన్నబోయినయ్. గొంతులోంచి మాట పెగిలి రాలేదు కొనగోటితో రెప్పలదిమితే చెమ్మతగలకపోదు. మొన్ననే పరీక్షలైపోయినాయట. మూడిట్లోనైనా ఫస్టుమార్కు తనకు రాకపోదుట. వైద్యనాథన్ తనకు పోటీవస్తున్నాడు. వాణ్ణి ఎలానైనా తను కిందికి తోసెయ్యాలి. దారిపొడుగునా వసపిట్టలా వాగుతూనే వున్నాడు. నాన్నంటే తనకి కోపం. అమ్మంటే తనకు చాలా ఇష్టం. అమ్మ తననికూడా మధుర తీసుకవెళ్తానని తీసుకపోలేదు. డబ్బులు చాలవన్నది. విచారంగా చెప్పాడు. వటపత్రశాయినీ, రంగమన్నారునీ, గోదాదేవినీ చూశాను సౌందరరాజన్ కూడానే వున్నాడు. సార్ ఎమ్. ఏ. లెక్చరర్. రిసెర్చిచేసేందుకు వచ్చారు. అని తనకుకనపడిన వాళ్ళతోనల్లా చెపుతూవుంటే నాకు చాలాసిగ్గనిపించింది. గోడమీద పెద్ద మర్రిఆకుబొమ్మ గీశారు. అచ్చం మర్రిఆకు లాగానే ఈనలూ. ఆ రంగూ భ్రమ కలిగించాయి అక్కడ వటపత్రశాయి వున్నాడు. ఆ తులసి వనంలోనే పెరియాళ్వారుకి గోదాదేవి దొరికింది. అదుగో రామానుజుల గుడి అని సౌందరరాజన్ చూపాడు.

"నువు గైడ్‌గా పనిచేస్తుంటావా అప్పుడప్పుడు" అని అడిగాను. చెయ్యడట. తనకు పెద్ద చదువులు చదివిన వాళ్ళనుచూస్తే చాలాఇష్టమట. తండ్రి కొన్నాళ్ళక్రితం గైడ్‌పనిచేసి పావలా. అర్ధా వాళ్ళిసే తీసుకునే వాడుట. ఇప్పుడు మంచంలో వున్నాడాయన లేవలేడు అని చెప్పాడు.

"సార్ నేను టెన్త్‌కాగానే హైదరాబాద్ వస్తాను. చిన్న ఉద్యోగం ఇప్పిస్తారా! నేను కాలేజీలోచేరి చదువుకోవాలనివుంది" అన్నాడు సౌందర

రాజన్ దీనంగా, వొప్పుకోండని ప్రాధేయపడుతూ. నాకు చాలా ఆశ్చర్య మనిపించింది. గుళ్ళో కోనేటి వొడ్డున మెట్లమీద కూచున్నాము. సంజె చీకట్లు ముసురుకుంటున్నాయి.

'శివగంగలో కాలేజీ వున్నది సార్, కాని మాఅప్ప చేరనివ్వడు. మీరు ఎంత అదృష్టవంతులు సార్' అన్నాడు ఆ కుర్రాడు.

ఎంతో ఉత్కంఠగా వుంది. "ఏమయ్యా నీకు బాగా చదువు వస్తున్నదంటున్నావు. మీ నాన్న ఎందుకు చదువుకోనివ్వడు'' అన్నాను. ఎవరో బాగాకొట్టి, అవమానపరిచి, గెంటివేసినట్లుగా అయిపోయింది ఆ పిల్లాడి ముఖం.

మీకు తెలీదు సార్, టెంత్ కాగానే మానాన్న ఉద్యోగంలో చేరు స్తాడు. నేను ఇంట్లోంచి పారిపోతాను. మా అక్కలకు పెళ్ళిళ్ళు కాలేదు. మా నాన్నకి, అమ్మకి ఎప్పుడూ అదేగోల. "ఎందరు అక్కలున్నారు నీకు" అని అడిగాను. నలుగురున్నారుట. ఇద్దరన్న లున్నారు. తాము మొత్తం ఏడుగురు. 'శివకామి అమ్మన్ కోవిల పక్కవీధిలోనే మా ఇల్లు. మా ఇంటికి వెళ్దాం రాండి సార్' అన్నాడు ఆ కుర్రాడు. "నన్ను ఎనిమిది న్నర బస్‌లో ఎక్కిస్తేచాలు. నువ్వు ఎక్కడకు రమ్మన్నా వస్తాను" అన్నాను. ఊరి మధ్యన వైష్ణవాలయంవున్నది అక్కడికి తీసుకవెళ్ళాడు.

ఎందుకోగాని కడుపులో తిప్పటం ప్రారంభమైంది. కాఫీలు. సోడాలు, తాగి తాగి, ఎండలో వందలమైళ్ళ ప్రయాణాలు చేసినందువల్ల శరీరం బడలికగా అనిపించింది. సౌందరరాజన్ అన్ని విషయాలు కలిపి, ముక్కలు ముక్కలుగా విరిచి, తడుముకుంటూ మాట్లాడుతున్నాడు. ఆవాళ శివాలయంలో కళ్యాణోత్సవం జరుగుతున్నది. విపరీతమైన దాహం వేసి,

ఆలయం పక్కన కోనేట్లో నీళ్లు తాగాను. తాగానే కాని మెట్లు ఎక్కి పైకి రాగానే భళ్ళున వాంతి అయింది. ఏమిటి దేముడా! ఇవాళ యీ ఊళ్లో, చిక్కుపడిపోతానో ఏమో ! ఈ ఊరు చిన్న ఊరు..చిన్న హోటలు కూడా వున్నట్లులేదు ఎలా అని బాధ పట్టుకుంది. శివాలయంలో వైద్యనాథన్ కనిపిస్తే సౌందరరాజన్ గొప్పగా పిలిచి, నా పరిచయం గురించి చెప్పు కొన్నాడు. అందులో మూడుసార్లు ఎమ్. ఏ. అని వినిపించింది. నేను నిలవలేకపోతున్నాను ఎవరన్నా డాక్టర్ కనిపిస్తే, బావుండునన్నాను సౌందరరాజన్‌తో. ఇంకా అరగంటలో బస్‌స్టాండుకు చేరుకోవాలి పక్క వీధిలోనే మా ఇల్లు. మా ఇంట్లో చెప్పి వెళదాం రమ్మన్నాడు రాజన్. నా కప్పటికే అడుగులు భారంగా పడుతున్నాయి. కళ్లు తిరుగుతున్నాయి. ఈ రాత్రి రెండుమూడు గంటలు బస్‌లో కూచుని మధురకు ప్రయాణం చెయ్యటం ఎలానా అని బాధ ఎదురైంది.

సౌందరరాజన్ వరండాలో చిన్న కుర్చీ తెచ్చి వేశాడు. కూచుంటే విరిగిపోతుందేమో ననిపించేట్లుగా వున్నది. కూచోమని బలవంతపెట్టాడు. రెండే గదులు, పెంకుటిల్లు. వాళ్ల నాన్నగారిని చూపి నన్ను పరిచయం చేశాడు. తనకేదో చాలా గొప్పతనం అబ్బినట్లుగా వున్నది సుందరరాజన్ వాలకం. ఆ తండ్రి బల్లమీద ఒకపక్కకు తిరిగి పడుకున్నాడు. నేను ఆయనగారి పరామర్శమాటలను అందుకునే స్థితిలోలేను. కళ్ళకేమీ కని పించడంలేదు. ఏమైపోతా నిక్కడ అనిపించింది. ఆ పూటకు ప్రయాణం చెయ్యలేనని చెప్పాను సుందరన్‌తో. నాకు బాగా జ్వరం వచ్చింది. ఇంటి యజమాని నెమ్మదిగా బల్లమీది నుంచి లేచివచ్చి, నా వొళ్లు తాకిచూసి పరిస్థితి గ్రహించాడు. చిన్నదో. పెద్దదో హోటలేదైనా వుంటే అక్క డకు మకాం మారుస్తానని చెప్పాను కాని అయ్యర్‌గారి కది అవమా నంగా తోచింది. నేను ప్రాధేయపడినా వినిపించుకోలేదు. ఆయన ఎలిమెం

టరీ స్కూలు మేష్టరు చేసి రిటైరైనారుట. ఆ తరవాత కుటుంబం విష యాలు నేను చాలా తెలుసుకున్నాను.

ఆయనకు ఏడుగురు పిల్లలు. కుటుంబాన్ని చక్కగా పోషించుకో లేకపోయినారు. ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయలేకపోయినారు. పెద్ద కొడుకు శివగంగలో తాలూకాఫీస్ గుమాస్తా చేస్తున్నాడు. రెండో కొడుకు రామ నాడ్‌లో మేస్త్రీగా వుంటున్నాడు. సుందరరాజన్ చిన్నవాడు. వాడికి పెద్ద చదువులు చదవాలని ఎంతో ఆరాటం. కాని స్కూలు ఫైనల్ కాగానే తండ్రి తన నెక్కడ గుమాస్తాగానో, ప్యూన్‌గానో చేరుస్తాడని భయం, అనుమానం, నమ్మకం. అప్పుడే చూశాను అంబుజవల్లిని. ద్రవిడదేశపు సౌందర్యమంతా మూర్తీభవించిన గంధర్వాంగనలా వున్నది. పాతికేళ్ళకు పైనే వుంటుంది వయస్సు. తల్లి ఆవాళే ఊరికి వెళ్ళింది కాబట్టి మిరియా ల కషాయమూ, బెల్లమ్ముక్కా తెచ్చిపెట్టింది అంబుజవల్లి. అప్పుడు పరకాయించి చూశాను. ఎన్నదగిన సౌందర్యం ఆమెది. ఆమె కన్నుల నిండా బేలతనం, దుఃఖమూ. గంధర్వాంగనలా వున్న ఆమె, ఇలా అడవిపువ్వులా వుండాల్సినస్థితి ఏమిటా అని చాలా విచారమేసింది. ఆమె వంటి స్త్రీకన్నా పురుషుడు కోరుకోదగ్గ గొప్ప వరం ఏమీ వుండదు. సుందరీవా, దరీవా అన్నారు కదా పెద్దలు కూడా। అలాటి సొగసున్నది ఆమెవద్ద అయితే శాపాన్ని అనుభవిస్తున్నట్లుగా దిగులుగా, దీనంగా వున్నదామె. ఆమె భాష నాకు రాదు. నా భాష ఆమెకు తెలీదు. లేకుంటే ఇంకా పది రోజు లక్కడే వుండిపోయి ఆమెను దర్శించే వాణ్ణి.

మర్రోజు సాయంకాలం బస్సుకు గాని నేను మధుర చేరుకోలేక పోయాను. ఆ రెండు పూటలు అంబుజవల్లి, నా పట్ల చూపిన ఆపేక్ష ఆకర్షణ, అంతఃకరణ ఎలా మరచిపోగలను. ఆ కన్నుల్లోనే అందమంతా వున్నది. అయితే అవి మూగ కనులు. సౌందరరాజన్ అక్కదగ్గర నా

గురించి ఉన్నంతసేపూ పొగుడుతూనే వున్నాడు. రిసెర్చి అంటే ఏమిటో, ఆ తరవాత ఏ డిగ్రీ వస్తోందో, ఆ డిగ్రీ అంటే ఎంత గొప్పో వర్ణించి చెబుతూనే వున్నాడు.

ఆ సాయంకాలం యజమాని దగ్గర శెలవు తీసుకుంటూ, అంబుజ వల్లి వేపు కూడా చేతులు జోడించి నమస్కారం చేశాను. ఆమె తొట్రుపడింది. ఉండి పొమ్మన్న కోరికో, వెళ్లవద్దన్న అభ్యర్థనో, ఎవరికెవరు అన్న విరక్తో, స్థైర్యమో, ఏమో నా కర్థంకాలేదు. కాని నా కళ్లలో నీళ్ళు తిరిగాయి. ఆమె సాన్నిధ్యంకన్నా కోరుకోదగ్గవ ఏమీ వుండదనిపించింది ఆ క్షణాన బయలుదేరేటప్పుడు. ఎక్కడైనా ఏదైనా అందమైన దృశ్యం చూసినా, మధురానుభూతినికాని, విషాదాన్నికాని రేకెత్తించే పాట విన్నా, అప్పటి నుంచీ నాకు అంబుజవల్లే గుర్తు వస్తూ వుంటుంది. దారిలో సౌందరరాజన్ చెప్పాడు. అత్తకొడుకున్నాడుట. తిన్నవేలిలో పెద్ద డాక్టరు. కట్నం ఇవ్వలేరనీ, పిల్ల చదువుకోలేదనీ, అంబుజాన్ని అత్త తన కొడుక్కు చేసుకోలేదు. తండ్రి చదువు చెప్పించలేకపోయినాడు. నేననుకున్నాను, ఎంత మూర్ఖుడో ఆ డాక్టరు అని. బస్సు ఎక్కుతూ చెప్పాను అందరికీ నా నమస్కారాలందజేయమని. నా అడ్రసును చిన్న డైరీలో రాసి ఇస్తూ ప్రెజెంట్ చేశాను సౌందరరాజన్‌కు. తప్పక ఉత్తరం రాయమని చెప్పాను.

తరవాత రెండు నెలలకు నేను ఇంటికి వచ్చేశాను. ఇంటికి రాగానే వెంటనే సౌందరరాజన్ పేరునే వొక కవరు వ్రాశాను. బహుశా అది అందుకొని ఎంత సంతోషిస్తాడో నాకు తెలుసు. స్కూల్లో స్నేహితులందరికీ చదివి వినిపిస్తాడు. ఆ కుర్రాడికి పెద్ద చదువులు చదవాలని ఎంతో ఉత్కంఠ, అందుకే నేనంటే పరిచయం కాగానే అంత అభిమానం కలిగి వుంటుంది. సౌందరరాజన్‌ను పొగిడాను. అయ్యరు గారికి నా నమస్కా

రాలు చెప్పాను. అంబుజవల్లికి నా కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలో తెలీకుండా వుందనీ, ఆ రెండుపూటలూ, మందూ, అనుపానమూ, పత్యమూ ఆమె నాకు అందించవలసి రావడంతో ఆమెను కష్టపెట్టవలసి వచ్చిందనీ వ్రాశాను. అరవ అక్షరాలు కూడ బలుక్కొని చదవగలననీ, కనక సంకోచం లేకుండా అరవంలో నైనాసరే వెంటనే ఉత్తరం రాయాల్సిందనీ కూడా వ్రాశాను.

ఆ రోజు నుంచీ సౌందరరాజన్ దగ్గర నుంచి ఎప్పుడెప్పుడు ఉత్తరం వస్తుందోనని ఎదురు చూస్తున్నాను. పది పదిహేను రోజులైనా జాబు రాకపోయేసరికి మనస్సుకి కష్టం కూడా కలిగింది.

ఆ తరవాత వో రోజున కార్డొకటి చిన్నపిల్లల చేతివ్రాత స్పష్టంగా కనపడుతూ వచ్చింది. అది సౌందరరాజన్ దగ్గర నుంచే. తనకు ఫస్ట్‌క్లాసు వచ్చిందనీ, రామనాథపురంలోనో, శివగంగలోనో, కాలేజీలో చేస్ చదువుకుంటానంటే అమ్మా నాన్నా చాలా వ్యతిరేకిస్తున్నారనీ, చాలా దుఃఖంతో వ్రాశాడు. పట్టుపట్టి చెక్కినట్లుగా ఇంగ్లీషులో వ్రాశాడా ఉత్తరాన్ని. అడ్రసు వ్రాసేవేపు తిప్పి చూతునుగదా ఆ భాగంలో తమిళం వ్రాసివున్నది. నిజానికి కారుబోర్డుల మీదా, పెద్ద పెద్ద సైన్ బోర్డుల మీదా, అతికష్టంతో కూడ బలుక్కొని, ఊళ్ళ పేర్లు కాఫీ హోటళ్ళ పేర్లు, చదవగలనేమోకాని, ఉత్తరాలు చదవగలనా నేను. అమితంగా కష్టపడి, మొదటి పంక్తిలో నా పేరు పోల్చుకోగలిగాను. రెండో పంక్తిలో వందనాలు వున్నాయి. అంతే తరవాత తెగలేదు.

నా మనస్సున పెద్ద మెరుపు. పూల జల్లులాటి వాన, పులకరింపులాంటి అనుభూతి, బహుశా ఈ నాలుగు ముక్కలూ అంబుజం వ్రాసి వుంటుంది. ఆ ఉత్తరంలో నేను కృతజ్ఞత వెల్లడించినదానికి సమాధానంగా

వ్రాసి వుంటుంది. ఏం వ్రాసిందో! మళ్లీ ఎప్పుడేనా ఈ వేపు వస్తారా అని వ్రాసి వుండవచ్చు. లేదా ఇంకా ఏమైనా ప్రత్యేకించి గుర్తు పెట్టుకోవాల్సిన విషయాలే వ్రాసిందేమో!

మా ఇంటిపక్క అరవవాళ్ళున్నారు. అయినా నేను ఆ నాలుగు వాక్యాలు చదివి చెప్పమని వాళ్ళను అడగను. ఎందుకంటే అంబుజం వ్రాసిన వాక్యాల్లో ప్రత్యేకించి మధురమైన భావమేదో వుండవచ్చు. లేదా అవి అంబుజం రాసిన వాక్యాలే కావంటారేమో వాళ్ళు!

ఏమీ తోచనప్పుడు కానీ, ఏదైనా కాగితం అవసరం కలిగి వెతకవలసి వచ్చినప్పుడుకాని పాత ఉత్తరాలన్నీ చదువుతూ, ఆ పని కొనసాగించడం నా కలవాటు. నేను ఆ పనిని మానలేను. ఏ కాగితం వెతుకుతున్నా కంటపడ్డ పాత ఉత్తరాలు చదువుతూనే వెతుకుతాను.

కాని ఆ ఉత్తరం కనిపించినప్పుడల్లా వసంతరుతువులాంటి, శీతాకాలపు ఎండలాంటి అనుభూతి ఏదో నా మనసు నిండి, ఆ చదవటం రాని, లిపి తెలీని వాక్యాలలో, అంబుజం కళ్ళను గుచ్చి గుచ్చి చూస్తూ వెతుక్కుంటాను.